
# వాళ్ళు తిరిగిరారు...

'హసన్'



''నేరం చేశారా?'', ముద్దాయిల్ని—దోషుల్ని, నిర్దోషుల్ని...బోనులో నిల బడిన ప్రతి ఒక్కళ్ళనీ ఇదే ఇదే ప్రశ్న అడిగే బెంచి క్లర్క్—చార్జి షీట్ చదివి వినిపించాక వాళ్ళని యాంత్రికంగా అడిగాడు.

అరవై ఏళ్ళు ఎప్పుడో దాటిన అబ్రహాం అలవాటుగా అవునూ కాదూ అన్నట్లుగా మధ్యరకంగా అనుమానంగా తల ఊపాడు.

నలభై ఏళ్ళ చిట్టి కూడా తండ్రిని అనుసరించాడు.

కానీ పద్ధెనిమిదేళ్ళ లొల్లా మాత్రం తల అడ్డంగా ఊపి ''చేయలేదు'' అని గట్టిగా అన్నాడు.

ఆ మాటతో ఉలికి పడిన అబ్రహాం మనవడ్ని చూసి కళ్ళతో సైగ చేశాడు.

ఒక పక్కగా నిలుచున్న చీపుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సాంప్రదాయం తప్పినప్పుడు మండిపడే శ్రోత్రియ బ్రాహ్మడిలాగా కోపంగా కనుకొలకుల నించి చూశాడు.

అప్పుడు మధ్యాహ్నమయింది.

ఇంకో రకంగా చెప్పాలంటే—రిమాండ్‌లో వున్న ముద్దాయిల్ని కోర్టులో హాజరు పరిచే టైమ్ అయింది.

మేజిస్ట్రేట్ కోర్టు బయట పచ్చటి ఎండ మిలమిలా మెరుస్తోంది.

కోర్టుకి కాస్తంత ఎడంగా వున్న ఊడలు దిగిన మర్రి చెట్టు నీడ మచ్చల కొండ శిలువలా పొడలు పొడలుగా పరుచుకుంది. నీడలో నిలుచున్న చాలా మంది ప్లీడర్లు, గుమస్తాలు, సాక్షులు, పోలీస్ జవాన్లు, ఫిర్యాదీలు, ముద్దాయిలు, బ్రోకర్లు, కమిషన్ ఏజంట్లు...ఇలా చాలా రకాల మంది అడవిలో వేటగాళ్ళలా, చెరువులో వలలు విసిరే జాలరి వాళ్ళలా, పది రూపాయిలకి పొట్టేలు తల నరికే కసాయి వాళ్ళలా...కొండొకచో...తలలు వొంచి నిలుచున్న బలి పశువుల్లా వున్నారు.

కోర్టు లోపల కాస్త చీకటిగా వుంది. అక్కడ అదో రకమైన ముంజు వాసన వేస్తోంది. ఆ వేళ ఎ.పి. పి.తో కలిసి నాలుగు నల్ల కోట్లు మాత్రం కోర్టు హాల్లో వున్నాయి. ఎప్పటి లాగానే ప్లీడర్ల ముఖాల మీద కదిలే నవ్వు మీద పల్చటి మాయ పొర కప్పబడే వుంది.

నలుగురు పోలీసులు ప్రతి ఒక్కళ్ళనీ అనుమానంగా చూస్తూ—ఏదో తెలీని అసంతృప్తితో ఆ వేళ ప్రొద్దుట సరిగా కాలకృత్యం తీరని వాళ్ళలాగా చిరాకుగా నిలబడి వున్నారు.

బెంచీ మీద మేజిస్ట్రేట్—పెద్ద వయసులేని కుర్రాయన. ఆయన్ని చూస్తే—చాలా మందికి చప్పున నవ్వు వచ్చేలాగా వుంటాడు. ముద్దాయిలకి మాత్రం భయం కలిగిస్తుంటాడు. శివాలయానికి వెళ్ళి దండం పెట్టుకుందామని—క్లబ్బుకి చేర్చే దారిలో నడుస్తూ, హైస్కూలు తరగతి గదుల్లో తేలినట్లుగా అయోమయంగా చూస్తుంటాడు. పరధ్యానంగా అనిపిస్తాడు.

బెంచి ఎక్కిన దగ్గర్నుంచి నిజంగా చెప్పే సాక్ష్యాల్ని, ప్రమాణం చేసి మరీ చెప్పే దొంగ సాక్ష్యాల్నీ నోరెత్తకుండా రాసుకునే మూగ ప్రాణి...మహారాజశ్రీ కోర్టువారు.

కేసు వాయిదా పడ్డాక అబ్రహాం, చిట్టి,



లొల్లాలని కోర్టు బయట తాలూకా పోలీస్ స్టేషన్ దగ్గరకి తీసికెళ్ళారు పోలీసులు.

చెట్టు కింద నిలబడి

"ఏరా? గొంతులుపైకి లేస్తున్నాయ్. మక్కెలిరగ దీస్తే నా కొడకల్లారా! కేసు వొప్పుకోరా? ఎంత ధైర్యంరా. అయ్యగారికి నేరం చెయ్యలేదని చెబుతార్రా..." కోపంగా గద్దించాడు వీపుళ్ళపల్లి కానిస్టేబుల్.

అబ్రహాం ఏమీ మాట్లాడలేదు. లొల్లా దవడ కండరం మాత్రం బిగుసుకుంది.

"ఎందుకొప్పుకోవాలి? మేం చేశామా?" దూకుడుగా అన్నాడు.

"అరేయ్...ఊరుకోరా..." కసిరాడు తండ్రి చిట్టి...

"ఏరోయ్...చానా దూరం వచ్చావే...సక్రంగా బతకాలని లేదా?..."

కానిస్టేబుల్ మాటలకి అడ్డం తగులుతూ...

"నువ్వు ఊరుకోరా" అంటూ మనవడ్ని కసిరి "బాబ్బాబు...ఏదో పసోడి ఉడుకు రక్తం... ఆడి మాటలు పట్టించుకోకు స్వామీ...స్వామీ..." బతిమిలాడుతూ అన్నాడు అబ్రహాం...తన వయసులో సగం కన్నా తక్కువ వయసున్న కానిస్టేబుల్ చేతులు పట్టుకుని.

అతని చేతులు విదిలించుకుని—తాలూకా స్టేషన్‌లోకి నడిచాడు పోలీస్ కానిస్టేబుల్.

"ఏరా? ఒంటి మీద తెలివుండే మాట్లాడుతున్నావా? పోలీసుల్తో నీకేందిరా. నువ్వొక్కడివేనా సెటిల్‌మెంట్‌లో మొగోడివి? కేసు వొప్పుకోక చేసేదేందిరా? జామీన్లకీ, ప్లీడరుబాబులకీ, కేసు నడపడానికీ ఎంతవుద్దో ఆలోచిస్తున్నావా?...అసలే కోపం మీదున్నాడు. ఈ కేసు తేలేలోపు...ఇంకో నాలుగు కేసుల్లో ఇరికిస్తే...అప్పుడేం చేస్తావురా... పిల్ల నాయాలా!...ఎట్టా బతుకుతావురా. ఇది ఇయ్యాల్టిది కాదుకదరా...ఊరుకో..." అన్నాడు అబ్రహాం...మనవడితో.

అలా అంటున్నప్పుడు లోకంలోని అన్యాయాల్ని, అక్రమాల్ని, ఎవడి బ్రతుకు వాడు ప్రశాంతంగా బ్రతకనివ్వని సంఘాన్ని, అధికారుల్ని, పోలీసుల్ని, ఎన్నో, ఎంత మందినో చూసి, విషాద భరితమైన చేదు అనుభవాల్ని—జ్ఞాపకాల నిండా, జీవితం నిండా ఆకుపచ్చటి పాచిలాగా పేర్చుకున్న అబ్రహాం కళ్ళలో...ఏదో తెలీని బాధ, దుఃఖం, చేతకానితనం...లీలగా కదిలాయి. కళ్ళ

కింది ముడతలు చిన్నగా కంపించాయి.

లొల్లా తాత కళ్ళలోకి చూడలేక తల దించుకున్నాడు. అప్పుడు అతని కళ్ళలో మాజీ మెదిలింది.

ఆరోనెల కడుపుతో వున్న పెళ్ళాం—మాజీ...! తామిద్దరూ పుట్టబోయే బిడ్డ గురించి కనే కలలు గుర్తొచ్చాయి. పచ్చటి వరినారులాంటి ఆశలూ గుర్తొచ్చాయి.

ఆ వేళ మధ్యాహ్నం—మెజిస్ట్రేట్ కోర్టు బయట చెట్టు నీడలో—ఒక నీడలాగా నిలబడి వున్న లొల్లాకి సాక్షాత్తుగా ఈ లోకం అంటేనే భయమేసింది. చుట్టూ, తోడేళ్ళు, పులులు, సింహాలు అదనుకోసం ఎదురు చూస్తూ చుట్టూ తిరుగుతున్నట్టుగా అనిపించింది.

జీవితం అంతా...దొంగ కేసుల్లో ఇరికించే చీపు ళ్ళపల్లి పోలీసుల కాళ్ళకిందపడి...నామ రూపాలు లేకుండా నాశనమవుతున్నట్టుగా అనిపించింది.

జేగురు రంగు గోడలు. పోలీస్ స్టేషన్‌కి, కోర్టుకీ, జైలుకీ...అన్నిటికీ అదే రంగు గోడలు...! ఆ గోడలు మూడు వైపుల నించీ నొక్కి—ఊపిరి అందనీకుండా చంపేస్తున్నట్టుగా అనిపించింది.

కోర్టు జవాను ఎవర్నో గట్టిగా మూడుసార్లు పిలుస్తున్నాడు.

ఎదురుగా వున్న తాలూకా స్టేషన్‌లోంచి ఎవరో మరెవర్నో తిడుతున్న బండ బూతులు వినిపిస్తున్నాయి. మర్రి చెట్టు కింద సిమెంట్ వైపుల మీద ఇద్దరు ఖాకీలు సిగరెట్లు తాగుతున్నారు. పక్కనే టీ బంకు దగ్గర—రాత్రిళ్ళు ఒళ్ళమ్ముకునే ఆడ మనిషితో ఒక ప్లీడరు, ఇద్దరు గుమస్తాలు హాస్యంగా మాట్లాడుతూ నవ్వుతున్నారు.

ఇంతలో కోర్టు జవాను రెండు గంటలు కొట్టాడు.

అబ్రహాం చెట్టు కింద కూలబడి బీడీ వెలిగించాడు. చిట్టి కానిస్టేబుల్‌తో ఏదో మాట్లాడుతున్నాడు.

ఆ క్షణంలో లొల్లాకి జీవితం అంతా అయోమయంగా అనిపించింది. ఎందుకో నిట్టూర్పు వచ్చింది.

పాలెంలో బాగా బలిసిన రాజుగారింట్లో ఇరవై కాసుల బంగారం పోయిందన్నారు. ఆ పక్కనే ఇంకో ఇంట్లో పది కాసుల బంగారం, నాలుగు టేపు రికార్డర్‌లు, అయిదు వాచీలు పోయాయన్నారు.

ఎస్. పురం—రత్నాపురం గ్యాంగ్‌కి ప్రభుత్వం సబ్సిడీ క్రింద ఇచ్చిన గొర్రెల జతని మేపుకుంటూ, వరినాట్లు వేసుకుని, కూరగాయల మళ్ళలో నీళ్ళు చల్లుకుని బ్రతికే తమని—ఆ వేళ ప్రొద్దుట పూట జీపులో వచ్చి నిద్ర లేపి—చీపుళ్ళపల్లి స్టేషన్‌కి తీసికెళ్ళడం—ఫలానా పాలెం పొలిమేర్లలో తను ముగ్గుర్నీ ముప్పై కాసుల బంగారంతో నాలుగు టేపు రికార్డర్ లతో, అయిదు వాచీలతో సహా వెంటాడి మరీ పట్టుకున్నట్టుగా—తమ ముందే కాగితాలు రాసి 'సాక్షుల' చేత సంతకాలు పెట్టించడం...లాకప్ రూమ్‌లోకి నెట్టడం...అంతా ఇప్పటికే లొల్లాకి పీడ కలలాగానే తోస్తోంది. కల చెదిరింది. నిద్ర మాయమై మెలకువవస్తే...! అనిపించింది.

చట్టం, న్యాయం...ఎలా వలావుడీ అవుతున్నాయ్...అతనికి ఇప్పుడిప్పుడే కొంచెం కొంచెంగా అర్థమవుతూ వస్తున్నాయి.

ఏమైనా సరే. ఈ దొంగ కేసులోంచి బయటపడాలి. మా బ్రతుకులు ఏమైపోయినా, నీకూ చింతా లేకుండా గడపాలి. ఎలాగైనాసరే...'' గట్టిగా తెగింపుతో అనుకున్నాడు లొల్లా.

కానీ... ఎలా బయటపడాలో తెలీలేదు. బయటపడే మార్గమేదో కనీసం ఊహకి కూడా అందలేదు.

కోర్టుకి కాస్తంత ఎడంగా అందంగా కత్తిరించిన సర్వీచెట్ల పక్కన ఆవేళ వాయిదా కోసం రాజమండ్రి సెంట్రల్ జైలు నించి సెంట్రల్ వాళ్ళు తీసుకొచ్చిన ఏసోబు కోసం... క్యారేజీతో భోజనం తెచ్చిన ఏసోబు పెళ్ళాం, కూతురితో అతనితో దిగులుగా మాట్లాడుతున్నారు.

హరిసులు అక్రమంగా ఇరికించే కేసుల్లో జైలుకి వెళ్ళే ఏసోబులాంటివాళ్ళు

భర్తలు జైళ్ళలో మగ్గుతుంటే... జానెడు కడుపునీ, భూమికి జానెడు ఎత్తుండే పసిగుడ్డుల్నీ పోషించుకోడానికి... పదికీ పాతికీ అమ్ముడుపోతూ... అమ్ముడుపోతూ... చివరికి... ఆ చీకటిగాడిలోకే... ఆ నిప్పుల ముళ్ళకంచెలోకే... తెలీకుండానే, వాళ్ళ ప్రమేయం లేకుండానే అమాంతం దిగబడిపోయి, చివరికి దాన్నే వృత్తిలాగా తీసుకుని బ్రతకాల్సిన దౌర్భాగ్యపు పరిస్థితుల్లోకి కూరుకుపోతూ... ఏసోబు పెళ్ళాం లాంటివాళ్ళు!

ఏసోబు పెళ్ళాం... ఒకప్పుడు పుష్టిగా, ఆరోగ్యంగా వుండి వుంటుంది. ఆమెకి అప్పుడు జీవితం రంగు రంగుల స్వప్నంలా కనిపించి, మెరిపించే వుంటుంది. అప్పట్లో ఆమె కళ్ళలో లెక్కలేనన్ని ఆశలు దివ్వెల్లా వెలిగ వుంటాయి.


ఇప్పుడు ఆమె - మసిబారిన దీపంలాగ, కారుమబ్బుల్తో కప్పబడిన నీలాకాశంలాగా... అతని కళ్ళ లోతుల్లోకి - కనపడన్ని దేన్నో వెతుకుతూ చూస్తూ... రంగు వెలిసిన చీర చెంగుతో, అతని నుదిటిమీది చెమటని అద్దుతోంది.

పక్కనే కూచొని, పోలీసులతో తప్పితే కనపడని తండ్రినీ, రాత్రిళ్ళు ఇంట్లో కనపడకుండా ఎక్కడికో వెళ్ళే తల్లినీ, మార్చి మార్చి చూస్తూ వుంది నాలుగేళ్ళ ఏసోబు కూతురు.

ఆ పిల్ల కళ్ళు - వైకుంఠపాళీ చదరంగంలాగా వింతగా మెరుస్తున్నాయి.

కానీ, ఆ కళ్ళ నిండా... విస్ఫోటనాల్లాంటి ఆశలకి బదులుగా.. భయపు విషజ్వాలల్ని వెదజల్లే పాములే కనిపిస్తున్నాయి.

వాళ్ళనే చూస్తున్న లొల్లాకి చప్పున కడుపుతో వున్న పెళ్ళాం గుర్తొచ్చింది.



ఒకసారంటూ రికార్డుల్లోకి ఎక్కాక... తరచుగా కేసుల్లో ఇరికించే పోలీసులు. తర్వాత... ఏసోబులాగా... నేను!! నేను జైల్లో వుంటే... నా పెళ్ళాం...

లొల్లాకి ఎందుకో కళ్ళలో నీళ్ళు ఊరాయి.

తల విదిలించాడు.

ముప్పై కాసుల బంగారం... దొంగతనం... హు... బంగారం... కాసులు...

పట్టున్న పెళ్ళాం మెళ్ళోని పుస్తెలు కళ్ళముందు మెదిలాయి.

"వొద్దు..." అనుకున్నాడు.

ఎందుకో దుఃఖం వచ్చింది.

'ఎలాగైనాసరే... ఈ కేసులోంచి బయటపడాలి... ఆ తర్వాత... ఈ చుట్టుపక్కలే వుండకుండా... అందరమూ... ఎటన్నా వెళ్ళిపోవాలి... కానీ... కానీ... తప్పదు... ప్లీడరుబాబుని మాట్లాడుకోవాలి' ఏ దిక్కూ తోచక... బాధగా అనుకున్నాడు లొల్లా.

* * *

తర్వాత కొద్ది రోజుల్లోనే చాలా జరిగిపోయాయి.

ఇన్నేళ్ళ నించీ అక్రమంగా ఇరికించే దొంగ కేసుల్ని నిర్లిప్తంగా వొప్పుకుంటూ వస్తున్న తాతనీ, తండ్రినీ ఒప్పించి... లాయర్ని మాట్లాడుకోవడం... బెయిలు తీసుకుని, ముగ్గురూ బయటకి రావడం... మేజిస్ట్రేట్ కోర్టులో కేసు నడవడం... అన్నీ జరిగిపోయాయి.

లాయర్ ఒక్కొక్క సాక్షినీ క్రాస్ పరీక్ష చేసి, తేలగొడుతున్నప్పుడు బోనులో నిలబడి వున్న లొల్లాకి ప్రపంచాన్ని జయిస్తున్నట్లుగా అనిపించింది. 'ఏ నేరమూ చేయనప్పుడు ఎందుకు భయపడాలి. తప్పుచేయనివాళ్ళని, ఈ ఎర్ర టోపీలూ, ఈ కోర్టులూ ఏమీ చేయలేవు' అని బలంగా అనిపించింది.

కేసు దర్యాప్తు చేసిన ఎస్.ఐ., హెడ్డు, వాళ్ళ వ్యక్తిగతమైన కక్షలు వున్నట్లుగా జరగని దాన్ని... ప్రమాణం చేసి మరీ... ఖచ్చితంగా జరిగినట్లుగా సాక్ష్యం చెప్పారు.

మళ్ళీ కొత్త కేసుల్లో వేటిలోనూ వీళ్ళ ముగ్గుర్నీ ఇరికించలేదు.

కేసు అయిదు నెలలపైనే నడిచింది. ఈ లోపలే లొల్లా పెళ్ళాం నీళ్ళాడి మగపిల్లాడిని కనింది.

ఆ రోజు - ముగ్గురి మీద పోలీసులు పెట్టిన కేసు కొట్టేశారు.

లొల్లాకి చెప్పలేనంత ఆనందం కల్గింది.

"బాగా వాదించాడు..." లాయర్ని మెచ్చుకున్నాడు.

అబ్రహాం ఏమీ మాట్లాడలేదు. ప్రకృతికి విరుద్ధంగా... ఏదో జరగరానిది జరిగినట్లుగా అనిపించింది. చిట్టి మాత్రం కొడుకు ఆనందంలో భాగం పంచుకున్నాడు.

ఆ సాయంత్రం - కోర్టు దగ్గర్నుండి ఎస్.పురానికి బయల్దేరుతున్న వాళ్ళు... తాలూకా ఎస్సై, చీపుళ్ళపల్లి హెడ్డుతో వీళ్ళనే చూస్తూ ఏదో మాట్లాడుతుండటం గమనించనేలేదు.

వాళ్ళే కాదు. కోర్టు దగ్గర మర్రిచెట్టు కింద... మందుకొట్టి కోర్టుకి వచ్చే ప్లీడర్లుగానీ, ఎరలు దొరికి, కోటు జేబులు నిండిన ప్లీడర్లుగానీ, వాయిదాలకొచ్చిన సాక్షుల్ని కూడా వదలకుండా పిండుకునే గుమాస్తాలుగానీ, కోర్టు జవాన్లుగానీ... కోర్టుహాల్లో గోడకి వేళాడబడి బిక్కముఖంతో చూసే గాంధీగారుగానీ, బెంచి మీద మేజి



స్ట్రేట్‌గానీ... ఎవరూ గమనించలేదు.

* * *

కొన్ని రోజుల తర్వాత... ఒక రోజు ప్రొద్దుటపూట...

ఎస్.పురంలోని రత్నాపురం గ్యాంగ్‌లోకి ఒక పోలీస్‌జీప్ వచ్చి ఆగింది. చీపుళ్ళపల్లి ఎస్సై, తాలూకా ఎస్సై, ఇంకా నలుగురు కానిస్టేబుళ్ళు - జీప్ లోంచి దిగారు.

పూరింటిపక్కన వేపపుల్లతో పళ్ళు తోముకుంటున్న చిట్టినీ, కొడుకుతో ఆడుకుంటున్న లొల్లానీ రెక్కలుపట్టుకుని లాక్కొచ్చి జీప్‌లో పడేశారు.

అక్కడికి పందమైళ్ళ దూరాన వున్న జిల్లా బోర్డర్లో వారం రోజుల క్రితం జరిగిన డెకాయిట్ కేసులో - వీళ్ళని ఇరికించే మహత్తరమైన అవకాశం కలిగినందుకూ- పోలీసులకే ఎదురుతిరిగి, కేసు కొట్టేయించుకున్నందుకు ఈ విధంగా ప్రతీకారం తీరుతున్నందుకూ... పైశాచికానందంతో ... ఎస్సైలు ఇద్దరూ ఒకళ్ళని చూసి ఒకళ్ళు నవ్వుకున్నారు.

దుమ్ము రేపుకుంటూ జీప్ వెళ్ళిపోయింది.

నులకమంచం మీద పడుకొని గుక్కపెట్టి ఏడుస్తున్న పసివాడి ఏడుపు జీప్ శబ్దంలో కలిసిపోయింది.

ఎన్నో చావుల్ని చూసి, మరెన్నో శవాల్ని తనచేతుల్తోటే - దహనం చేసిన తల పండిన కాటికాపరిలాగా ... పూరింటి గుంజకి ఆనుకుని నిలబడిన అబ్రహాం ... ఏదో తెలీని శ్మశాన వైరాగ్యంతో ... ఎత్తుగా లేచిన దుమ్ముపొరల్లోకి నిర్లిప్తంగా చూస్తూ వుండిపోయాడు.

అలాంటి ఉదయాలూ సాయంత్రాలూ చాలా గడిచాయి. వెళ్ళినవాళ్ళు మాత్రం తిరిగి రాలేదు.

* * *

సాయంత్రం చీకటిలోకి క్రమంగా మారుతోంది.

నులక మంచం మీద కూచొని చుట్టతాగుతున్న అబ్రహాం - చుట్టే తోవ నించి చూపుల్ని మరల్చుకుని - తలపంకించి చిన్నగా పెదవి విరిచాడు.

అతని కళ్ళలో శవాన్ని తగలబెట్టే మంటల్లా వ్యాపిస్తున్న సంధ్యాకాశపు ఎరుపు... నల్లటి పొగలాంటి చీకటిలాగా ఆవరించుకుంటోంది.

మందలోంచి విడివడిన గొర్రె ఏదో భయం భయంగా అరవడం దూరం నించి వినిపిస్తోంది.

రైలు పట్టాల మీద రెండు తీతువ పిట్టలు కర్ణకఠోరంగా అరుస్తూ గిరికీలు కొడుతున్నాయి.

నాలుగో తరానికి వారసుడైన లొల్లా కొడుకు తల్లిపాలు తాగి, ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

ఎస్.పురం చుట్టూ వున్న యూకలిప్టస్ చెట్లు - గుండెలు పిండే ఏ దారుణ రహస్యాన్నో తమలో దాచుకుని, కుమిలిపోతున్నట్లుగా, చీకట్లో మునగదీసుకుంటున్నాయి.

ఎస్.పురం మీద చీకటి చిక్కగా అల్లుకుంటోంది.

ఆ చీకటి కొత్తదేం కాదు. ఆ వూరు పుట్టినప్పటినించి... అక్కడివాళ్ళ జీవితాల్ని ... అమాంతం మింగేస్తూ వున్నదే...!!